# హజ్ గైడు – 7. సలహాలు

﴾ دليل الحاج - ٧ : نصائح ﴿

[ తెలుగు – Telugu – تلغو ]

dalil-alhaj.com


**అనువాదం :** ముహమ్మద్ కరీముల్లాహ్

**పునర్విమర్శ :** షేఖ్ నజీర్ అహ్మద్



2010 - 1431

islamhouse.com

# ﴿ دليل الحاج - ٧ : نصائح ﴾

« باللغة التلغو »

dalil-alhaj.com

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نزير أحمد

2010 - 1431

islamhouse.com

# హజ్ గైడు – 7. సలహాలు

## హజ్ యాత్రికుని కొరకు సలహాలు మరియు ముఖ్యమైన విషయాలు

### సాధారణ సలహాలు:

1. అప్పు చేసి హజ్ యాత్రకు వెళ్ళటానికి ప్రయత్నించకండి. ఎందుకంటే హజ్ యాత్ర ఖర్చులకు సరిపడా ధనం లేని వారి కొరకు హజ్ యాత్ర తప్పనిసరి కాదు.
2. ముందుగానే హజ్ ఆచరణలు పూర్తిగా నేర్చుకోండి. అలా చేయకపోతే, అజ్ఞానం వలన మీ హజ్ ఆరాధన నిష్ప్రయోజనం అయిపోవచ్చు లేదా దాని పుణ్యాలు పూర్తిగా పొందలేక పోవచ్చు.
3. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పద్ధతిని అంటే సున్నతులను అనుసరిస్తూ హజ్ యాత్ర పూర్తి చేయటానికి మీ శాయశక్తులా ప్రయత్నించండి.
4. ఓ హాజీ సోదరుడా, హజ్ యాత్రలో వివిధ మధ్హబుల విధానాలు అనుసరించటం నుండి తప్పించుకోవటం కష్టం. దీని గురించి చింతించ వద్దు. ఎందుకంటే అల్లాహ్ ఎవరిపైనా వారి శక్తికి మించిన భారాన్ని మోపడు.
5. ప్రజలను చూస్తూ, వారిని అనుకరించడం వంటి వాటి నుండి దూరంగా ఉండండి. మీ ఆచరణలపై మరియు సరైన హజ్ పద్ధతిపై దృష్టి కేంద్రీకరించండి. ఎందుకంటే కొందరు ముస్లింలు తమ అజ్ఞానం చేత విచిత్రమైన పనులు, ఆచరణలు చేస్తూ ఉండటం మీకు కనబడవచ్చు. ఆ విచిత్ర అజ్ఞాన పనులకు దూరంగా ఉండటానికి, ప్రశాంతంగా, ఓర్పుతో ఉండటానికి ప్రయత్నించండి.
6. తప్పులు, పాపాలు చేయకుండా ఉండండి. వాదనలకు మరియు భేదాలకు దూరంగా ఉండండి.
7. తవాఫ్, సయీ మరియు ఇతర హజ్ ఆచరణలు చేస్తున్నప్పుడు ఆ గుంపులోని తోటి హాజీలతో పోటీ పడకూడదు. వారికి హాని కలిగించకూడదు.
8. రద్దీగా ఉన్న మహిళలను గుద్దటం, తాకటం వంటి వాటి నుండి జాగ్రత్త వహించండి. (ముఖ్యంగా తవాఫ్, సయీ మరియు అరఫాత్ లలో).
9. కొన్ని హజ్ ఆచరణలు ఎందుకు చేయాలి, వాటి వెనుక ఉన్న ఉద్దేశ్యమేమిటి... మొదలైన ప్రశ్నలు మిమ్మల్ని మీరే వేసుకోవద్దు మరియు ఇతరులను ప్రశ్నించవద్దు. అల్లాహ్ కు పూర్తిగా సమర్పించుకోవటానికి ప్రయత్నించండి.
10. మీరు స్నేహపూర్వకంగా మెలగవలెను. మక్కా మరియు మదీనా వాసులతో మర్యాదగా మెలగవలెను. వారితో పోట్లాడటం, హింసకు పాల్పడటం వంటి వాటికి నుండి దూరంగా ఉండవలెను. ఎందుకంటే మక్కా వాసులు అల్లాహ్ గృహానికి పొరుగున నివసిస్తున్న ఉన్నత ప్రజలు మరియు మదీనా వాసులు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు పొరుగున నివసిస్తున్న ఉన్నత ప్రజలు.

**తవాఫ్ లో తీసుకోవలసిన జాగ్రత్తలు:**

1. ఓ హాజీ సోదరుడా, తవాఫ్ అనేది అల్ హరమ్ యొక్క అభివాదం వంటిది. ఇది కూడా నమాజు వంటిదే. అయితే తవాఫ్ లో మాట్లాడటానికి అల్లాహ్ అనుమతించినాడు. కాబట్టి, నమాజులో వలే, మేజర్ (హదథ్ అక్బర్) మరియు మైనరు (హదథ్ అస్గర్) వంటి అపరిశుద్ధ స్థితుల నుండి పవిత్రత పొందటం మరియు తమ మర్మాంగాలను కప్పుకోవటం మొదలైనవి తవాఫ్ కొరకు విధించబడిన ముఖ్య షరతులు.
2. తవాఫ్ చేస్తున్నప్పుడు, కాబాగృహపు ఒక మూలలో ఉన్న హజ్రె అస్వద్ అనే నల్లటి రాయి వైపు చేయి చూపటం కొరకు ఎక్కువ సేపు మధ్యలో నిలబడిపోవద్దు. దాని వలన రద్దీ పెరిగిపోయి, ఇతరులకు అసౌకర్యం కలుగును.
3. హజ్రె అస్వద్ ను ముద్దాడడం కొరకు ఇతరులతో పోటీ పడవద్దు. దానిని ముద్దాడటం సున్నత్ ఆచరణ అయితే, స్వయంగా తమకు తాము మరియు ఇతరులకు హాని కలిగించకుండా ఉండటమనేది తప్పని సరి వాజిబ్ ఆచరణ. వాజిబ్ ఆచరణకు సున్నత్ ఆచరణ కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది.
4. తవాఫ్ చేసే సమయంలో యాత్రికుడు అల్లాహ్ కు పూర్తిగా సమర్పించుకుంటూ, ఉత్తమంగా, మంచి మనస్సుతో ప్రవర్తించవలెను.
5. ఏడు తవాఫులు నిరంతరాయంగా చేయవలెను – ఫర్ద్ నమాజు జరుగుతుంటే తప్ప. ఇది సున్నతు ఆధారంగా ధృవీకరించబడి ఉన్నది.
6. చేతుల వేళ్ళు విరచటం లేదా ఒక చేతి వేళ్ళు రెండో దానిలో చొప్పించటం వంటి వాటికి దూరంగా ఉండండి. అలాగే తినటం, త్రాగటం మరియు అల్లాహ్ ధ్యానం, దుఆ తప్ప ఇతర విషయాలు పలకటం వంటివి వాటికి దూరంగా ఉండండి.
7. బాత్రూముకు వెళ్ళవలసిన ఆవశ్యకత ఏర్పడిన ఒత్తిడిలో లేదా కడుపులోని గ్యాసు ఇబ్బంది పెడుతున్నప్పుడు తవాఫ్ చేయటం మంచిది కాదు.
8. హిజ్ర్ ఇస్మాయీల్ అనే కాబాగృహ భాగపు లోపల వైపు నుండి కాకుండా, దానికి వెలుపల వైపు నుండి తవాఫ్ చేసేటట్లు జాగ్రత్త వహించండి. ఎందుకంటే అలా చేయటం ద్వారా యాత్రికుడు కాబాగృహ తవాఫు కొంత భాగం వదిలి వేసి, తవాఫును సరిగ్గా పూర్తి చేయని వాడవుతాడు. దాని వలన అతని ఆ తవాఫు రద్దయి పోయి, నిరుపయోగంగా మారిపోతుంది.
9. తవాఫ్ తన స్వరాన్ని హెచ్చించకుండా జాగ్రత్త వహించండి. ఎందుకంటే అలా చేయటం వలన ఇతర యాత్రికులకు ఇబ్బంది కలుగవచ్చు.
10. అన్ని తవాఫులలో అల్ రమల్ చేయటం అంటే వడివడిగా నడవడం చేయవద్దు. ఎందుకంటే మొదటి మూడు తవాఫులలో మాత్రమే అల్ రమల్ చేయటం సున్నతు.

11. మొదటి మూడు తవాఫులలో అల్ రమల్ చేయటం (వడి వడిగా నడవటం) సున్నతు. పురుషులు మాత్రమే అన్ని తవాఫులలో మాత్రం ఇద్ తిబా (కుడి భుజం బయటకు కనబడేలా చూపటం) చేయవలెను.
12. స్త్రీలు తవాఫులో అల్ రమల్ చేయటం మరియు సయీలో జాగింగు వలే త్వరత్వరగా నడవటమనేది సున్నతులో లేదు.
13. నమాజులలో ఇద్ తిబా చేయవద్దు.
14. మఖామె ఇబ్రాహీమును స్పర్శించటం లేదా దానిని ముద్దు పెట్టుకోవటం, కాబాగృహ గోడలను రుద్దుకోవటం చేయవద్దు. ఎందుకంటే ఇది సున్నతుకు వ్యతిరేకమైన కల్పిత చర్య.
15. బాగా రద్దీగా ఉన్నప్పుడు మఖామె ఇబ్రాహీము దగ్గరే నమాజు చేయాలని ప్రయత్నించవద్దు. ఎందుకంటే ఆ నమాజు హరమ్ లో ఎక్కడైనా చేయవచ్చు.
16. తమ తల వెంట్రుకలు కత్తిరింపజేస్తూ, ఇహ్రాం నుండి బయటకు వచ్చేటప్పుడు, స్త్రీలు తమ తల వెంట్రుకలు ఇతరులకు కనబడకుండా తప్పనిసరిగా జాగ్రత్త వహించవలెను.

**అరాఫాత్ దినం గురించిన సలహాలు:**

1. నిలకడగా తల్బియా పలుకుతూ, అరఫాత్ మైదానం వైపునకు సాగవలెను.
2. అరఫాత్ దినమున అలసత్వంగా, బద్ధకంగా, మందకోడితనంగా ఉండక చురుకుగా ఉండి, అల్లాహ్ యొక్క ధ్యానంలో, దుఆలలో నిమగ్నమై ఉండవలెను. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు: "ప్రార్థనలలో ఉత్తమమైనది అరఫాత్ దినం రోజున చేసే దుఆ".
3. దుఆ చేసేటప్పుడు, వీలయితే ఖిబ్లాదిశ వైపు తిరిగి దుఆ చేసేటట్లు జాగ్రత్త వహించవలెను.
4. అరఫాత్ మైదానపు హద్దులలోపలే నిలబడవలెను. అంతేగాని హద్దుల బయట కాదు.
5. మస్జిదు మూడు వంతులు అరఫాత్ మైదానంలో మరియు ఒక భాగం అరఫాత్ భాగం బయట ఉన్న విషయాన్ని నమీరహ్ మస్జిదులోపల గడిపే యాత్రికులు గుర్తించి, తగిన జాగ్తతలు తీసుకోవలెను. ఒకవేళ అలా జాగ్రత్త పడకపోతే, వారు అరఫాత్ లో సరైన చోట నిలబడటాన్ని కోల్పోయే అవకాశం ఉంది. ఫలితంగా హజ్ యాత్ర అసంపూర్తి అయిపోతుంది.
6. జబలె రహ్మాహ్ కొండపై నిలబడటానికి ప్రయత్నించవద్దు. ఎందుకంటే దీని వలన అక్కడ రద్దీ పెరిగిపోయి, ఇతరులకు హాని కలుగవచ్చు. పైగా అలా కొండపై నిలబడటం సున్నతులో లేదు.
7. సూర్యాస్తమయం అవగానే, అరఫాత్ మైదానం వదలవలెను. ఒకవేళ సూర్యాస్తమయం కంటే ముందే అరఫాత్ మైదానాన్ని వదిలివేస్తే, ప్రాయశ్చితంగా జంతుబలి సమర్పించుకోవలసి ఉంటుంది.
8. అల్లాహ్ క్షమించలేదేమో అనే అపనమ్మకం, అనుమానం నుండి జాగ్రత్త వహించండి. ఎందుకంటే అలాంటి సందేహం, అరఫాత్ దినం తరువాత మీరు చేసే మొదటి పాపం కాగలదు.

**మీనాలో గడపటం గురించిన సలహాలు:**

1. జమరాత్ పై విసిరే రాళ్ళు అక్కడ నిర్దేశింపబడిన చోటనే పడేటట్లు జాగ్రత్త వహించవలెను. వాటిని గురిచేసి విసరవలెను, అంతేగాని ఎలాగోలా విసురుతున్నట్లు విసరకూడదు.

2. కంకరరాళ్ళన్నీ ఒకేసారి జమరాత్ పై విసరకూడదు. అలా ఎవరైనా విసిరితే, అతను ఏడు సార్లు కంకరరాళ్ళు విసిరినట్లు గాక, ఒకసారే కంకరరాయి విసిరినట్లుగా పరిగణింపబడును.
3. నిర్దేశింపబడిన క్రమంలోనే జమరాతుల రమీ చేయవలెను అంటే కంకరరాళ్ళు విసరవలెను, అంతేగాని దానికి వ్యతిరేకమైన క్రమంలో కాదు. తప్పని సరిగా ముందుగా జమరాతుల్ సుగ్రా (చిన్న జమరాతు)పై, తరువాత జమరాతుల్ వస్త (మధ్య జమరాతు) ఆ తరువాత జమరాతు అల్ కుబ్ర (పెద్ద జమరాతు) పై కంకరరాళ్ళు విసరవలెను.
4. కావాలని తక్కువ సంఖ్యలో లేదా ఎక్కువ సంఖ్యలో కంకరరాళ్ళు విసరవద్దు – విసిరిన కంకరరాళ్ళ సంఖ్యపై అనుమానం కలిగినపుడు తప్ప.
5. చిన్న జమరాతుపై మరియు మధ్య జమరాతుపై రాళ్ళు విసిరిన తరువాత దుఆ చేయటం మరచిపోవద్దు. అలా చేయకపోవటం సున్నతుకు వ్యతిరేకం అవుతుంది మరియు అల్లాహ్ యొక్క కొన్ని అనుగ్రహాలు కోల్పోయే ప్రమాదం ఉంది.
6. పెద్ద జమరాతుపై రాళ్ళు విసిరిన తరువాత దుఆ చేయవద్దు. పెద్ద జమరాతు వద్ద దుఆ చేయటమనేది సున్నతుకు వ్యతిరేకం.

**మదీనా యాత్ర గురించిన సలహాలు:**

1. కేవలం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క సున్నతుల ప్రకారం ప్రతి ఆచరణా, ఆరాధనా ఉండేటట్లు చూసుకోవలెను మరియు సున్నతులకు అత్యంత గౌరవం చూపవలెను.
2. మస్జిదె నబవీలోని అర్రౌధ అనే ప్రాంతంలో నమాజు చేయటానికి శాయశక్తులా ప్రయత్నించవలెను. ఎందుకంటే ఇది స్వర్గంలోని భాగమని హదీథులలో చెప్పబడింది.
3. సమాధి గోడను స్పర్శించటం గాని, ముద్దాడటం గాని చేయవద్దు.
4. మదీనాలో చిత్తశుద్ధితో, భక్తిశ్రద్ధలతో, మర్యాదతో నడువవలెను. ఎందుకంటే మీరు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరుల అడుగులపై నడుస్తున్నారు.
5. బిగ్గరగా నవ్వటం లేదా మాట్లాడటం చేయవద్దు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధిలో గొంతు హెచ్చించటం వలన మీ పుణ్యాలు నిరుపయోగం అవుతాయి.
6. సిగరెట్లు త్రాగవద్దు. మీరు గనుక తరచుగా పొగత్రాగే అలవాటు ఉన్నవారైతే, మక్కా మరియు మదీనా పట్టణాలలో దానికి దూరంగా ఉండటానికి పూర్తిగా ప్రయత్నించండి. ఎందుకంటే అలా చేయటం పాపకార్యంగా పరిగణించబడును. ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నగరంలో. అంతేగాక ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధిలో అమర్యాదగా ప్రవర్తించినట్లు అవుతుంది.